సాక్షి సూర్యాపేట

బుధవారం । 26 । మార్చి । 2025



ఇంటి వద్దకే తలంబ్రాలు
భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను టీజీఎస్ ఆర్టీసీ ఇంటివద్దకే అందిస్తోంది. - 8లో



ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు..
అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో వాటర్ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. - 8లో



న్యూస్‌రీల్

తుంగతుర్తి సీఐపై వేటు

నూతనకల్: నూతనకల్ మండలం మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ హత్య కేసుతో పాటు గ్రామంలో జరిగిన వివిధ సంఘటనలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్‌పై మంగళవారం బదిలీ వేటు పడింది. రాష్ట్ర మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. హత్యకేసు విషయాన్ని పసిగట్టలేకపోవడంతో స్థానిక డీఎస్పీ రవి, ఎస్‌ఐ మహేంద్రనాథ్‌లకు మెమోలు జారీ చేశారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



తిమ్మాపురంలో వాటర్‌షెడ్ యాత్రలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అర్వపల్లి: నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఎదుట మొక్కలు నాటారు. రుణాలపై మహిళలు పొందిన కుట్టు మిషన్లు పరిశీలించారు. వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న అధికారులు, రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ అప్పారావు, వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి వినయ్‌భార్గవ్, ఎంపీడీఓ టి.గోపి, ఎంఈఓ బి.బాలునాయక్, ఏపీఓ ఉపేందర్, ఏపీఎం మల్లేష్, వాటర్‌షెడ్ మండల ఇన్‌చార్జి డి.రవీందర్, ఈసీ నగేష్, గిర్దావర్ వెంకట్‌రెడ్డి, సీసీ నగేష్, హెచ్‌ఎంలు కుంభం ప్రభాకర్, జి.చంద్రారెడ్డి, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు కందుల తిరుమలరావు, పెద్దరాములు, జీడి పద్మ, నాగమ్మ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

సూర్యాపేటఅర్బన్ : ప్రజా, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ కాల్వ పరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో చాలా గ్రామాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

విధుల నిర్వహణలో అలసత్వం వహించొద్దు



నాగారంబంగ్లాలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీపీఓ యాదగిరి

నాగారం : పంచాయతీ కార్యదర్శులు విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి ఆదేశించారు. నాగారం మండలంలోని నాగారంబంగ్లా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఈనెలాఖరులోగా వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సూచించారు. వేసవిలో వన నర్సరీలను సంరక్షించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచుతూ, పనిలో నాణ్యతను పాటించాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీ, ఉపాధి పనులు, శ్మశాన వాటికను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ కె.మారయ్య, పంచాయతీ కార్యదర్శి అరుణ్ ఉన్నారు.

గోదావరి జలాలు నిలిపివేత

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు వారబందీ విధానంలో విడుదల చేస్తున్న గోదావరి జలాలను మంగళవారం మధ్యాహ్నం నిలిపివేశారు. ఈ సీజన్‌కుగాను జనవరి 1 నుంచి జిల్లాకు నీటిని పునరుద్ధరించారు. వారబందీ విధానంలో ఇప్పటి వరకు నీటిని వదిలారు. మొత్తం ఈసీజన్‌లో ఆరు విడతల్లో నీటిని వదిలారు. చివరి విడతగా ఈనెల 17 నుంచి నీటిని ఇచ్చారు. కాగా వరి పొలాలు మరో 15 రోజుల్లో చేతికందనున్నాయని అప్పటి వరకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

30న హుజూర్‌నగర్‌కు సీఎం రేవంత్ రెడ్డి

సన్నబియ్యం పంపిణీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



హుజూర్‌నగర్ : ఈనెల 30న ఉగాది పర్వదినం నాడు హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- 30న సాయంత్రం 5 గంటలకు సీఎం హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి బయలుదేరుతారు.
- 5.45 గంటలకు హుజూర్‌నగర్ శివారులోని రామస్వామి గుట్ట వద్ద హెలిపాడ్‌లో దిగి అక్కడ నిర్మాణంలో ఉన్న 2వేల సింగల్ బెడ్రూం ఇళ్ల మోడల్ కాలనీని పరిశీలిస్తారు.
- అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి హుజూర్‌నగర్ పట్టణంలోని బహిరంగ సభా ప్రాంగణం సమీపంలోగల హెలిపాడ్‌లో 6.15 గంటలకు సీఎం దిగుతారు.
- 6.15 గంటలనుంచి 7.30 గంటల వరకు సభావేదికపై నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు.
- తదుపరి ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడతారు.
- రాత్రి 7.30 గంటలకు సీఎం హుజూర్‌నగర్ నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరుతారు
- రాత్రి 9.45 గంటలకు సీఎం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు





సీఎం సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, అధికారులు, పౌరసరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంక ఆలాకు ఏర్పాట్లను వివరిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

హుజూర్‌నగర్ : ఉగాది పర్వదినం రోజున సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వెల్లడించారు. హుజూర్‌నగర్‌లో సీఎం సభా ఏర్పాట్లను ఎస్పీ నరసింహతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలిపాడ్, అప్రోచ్ రోడ్లను 27వ తేదీ సాయంత్రం వరకు పూర్తిచేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలు చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి వాటిలో ఫ్లడ్‌లైట్లు అమర్చాలన్నారు. అనంతరం హుజూర్‌నగర్ పట్టణ శివారులోని ఫణిగిరి గుట్ట వద్ద హెలిపాడ్ స్థలం, నిర్మాణంలో ఉన్న మోడల్ కాలనీని ఆయన పరిశీలించారు.

అధికారులతో సమీక్ష

సీఎం పర్యటన ఏర్పాట్లపై హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెలిపాడ్, పార్కింగ్, వీఐపీలకు ప్రొటోకాల్, సభా వేదిక వద్ద తహసీల్దార్‌లకు ఇన్‌చార్జి విధులు కేటాయించినట్లు చెప్పారు. ఎండకాలం కాబట్టి ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేయాలని ప్రతి సెక్టార్‌కు ఎంపీడీఓ, ఎంపీఓ ఇన్‌చార్జిగా ఉంచాలన్నారు. సభాస్థలి వద్ద సమాచార శాఖ ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాంబాబు, హుజూర్ నగర్, కోదాడ ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, డీఎం ప్రసాద్, తహసీల్దార్లు నాగార్జున రెడ్డి, కమలాకర్, మంగా, జ్యోతి, కవిత, సైదులు, సురేందర్ రెడ్డి, విద్యుత్ డీఈ వెంకట కిష్టయ్య, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమంద రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు యరగాని నాగన్న గౌడ్, తన్నీరు మల్లికార్జున్, గూడెపు శ్రీనివాస్, కోతి సంపత్‌రెడ్డి, దొంతగాని శ్రీనివాస్, దొంగరి వెంకటేశ్వర్లు, ఆదెర్ల శ్రీనివాస రెడ్డి, కోడి ఉపేందర్ పాల్గొన్నారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన పౌరసరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుజూర్‌నగర్ పర్యటన నేపథ్యంలో స్థానికంగా జరుగుతున్న ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంక ఆలా మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆమెకు సభా ప్రాంగణం, హెలిపాడ్‌ను చూపించి వాటి గురించి వివరించారు. అంతకు ముందు కలెక్టర్ ఆమెకు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

4.07 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధమవుతున్న యంత్రాంగం

- కొనుగోళ్ల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం
- ఇంకా ఖరారు కాని కేంద్రాలు
- వచ్చే నెల మొదటివారం నుంచి కొనుగోళ్లు



ధాన్యం కొనుగోలు వివరాలు

సాగు విస్తీర్ణం	4,73,739 ఎకరాలు
దిగుబడి అంచనా	12 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు లక్ష్యం	4.07 లక్షల మెట్రిక్ టన్నులు
కావాల్సిన గన్నీ బ్యాగులు	75 లక్షలు
అందుబాటులో ఉన్నవి:	25 లక్షలు

సూర్యాపేట : జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే కొనుగోళ్లు ప్రారంభించేలా సివిల్ సప్లయ్ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. వేసవి కాలం కావడంతో తేమ శాతంతో ఇబ్బంది ఉండదని, వరి కోసిన వెంటనే ధాన్యం కొంటామని అధికారులు చెబుతున్నారు.

4.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 4,73,739 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో సన్నరకం 2,63,250 ఎకరాలకు గాను 6,58,125 మెట్రిక్ టన్నుల దిగుబడి, దొడ్డురకం 2,10,489 ఎకరాలకు గాను 5,47,271 మెట్రిక్ టన్నులు.. మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుంది. ఇందులో స్థానిక అవసరాలకు 98,718, విత్తనాలకు 1600 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ వ్యాపారులకు మరో 6,97,142 మెట్రిక్ టన్నులు విక్రయించవచ్చని, అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు సెంటర్లకు దాదాపు 4.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు సివిల్ సప్లయ్ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలోనే ఎన్ని సెంటర్లను ప్రారంభించాల్సి ఉంటుంది..? పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, ఇతరుల ద్వారా ఎన్ని కొనుగోలు కేంద్రాలను నెలకొల్పాల్సి ఉంటుందోనన్న కసరత్తును రెండుమూడు రోజుల్లోనే పూర్తి చేయనున్నారు. బోనస్ కారణంగా జిల్లాలో రైతులు సన్నరకాలను కూడా బాగానే సాగు చేయడంతో వీటికోసం వేరుగానే సెంటర్లను నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నారు.

అందుబాటులో 25 లక్షల గన్నీబ్యాగులు

గత యాసంగిలో ప్రారంభించినట్లుగానే ఏప్రిల్ మొదటి వారంలోనే సెంటర్లను ప్రారంభించనున్నారు. 4.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు గాను దాదాపు 75 లక్షల గన్నీబ్యాగులు అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 25 లక్షల గన్నీబ్యాగులు సిద్ధంగా ఉండగా.. కొనుగోళ్లు ప్రారంభమయ్యే నాటికి మరో 10 లక్షలు గన్నీబ్యాగులను సేకరించనున్నారు. మిగతావాటిని విడతల వారీగా ఎలాంటి కొరత లేకుండా సేకరించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే యాసంగి సీజన్ కావడంతో అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ఉండేలా టార్పాలిన్లు సైతం అందుబాటులో ఉంచనున్నారు. ఇక ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ మిషన్లు సిద్ధం చేశారు.

కొనుగోళ్లకు సిద్ధమవుతున్నాం



యాసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభిలా ఏర్పాట్లు చేస్తున్నాం. వ్యవసాయ అధికారుల దిగుబడి అంచనాలకు అనుగుణంగా త్వరలోనే ఎన్ని సెంటర్లు ప్రారంభించాలో తేలుస్తాం. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తాం.

– ప్రసాద్, సివిల్ సప్లయ్ డీఎం

ఘనంగా సహస్రకలశాభిషేకం



సహస్రకలశాభిషేక మహోత్సవంలో పాల్గొన్న చిన జీయర్‌స్వామి

మేళ్లచెరువు : మేళ్లచెరువు మండల కేంద్రంలోని మైహోమ్ సిమెంట్ పరిశ్రమలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సహస్రకలశాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో వెయ్యిన్నొకటి (1001) కలశాలతో సుగంధ ద్రవ్యాలు, కర్పూరం, పంచామృతంతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 19 న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిసినట్లు పేర్కొన్నారు. అనంతరం జీయర్‌స్వామి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో మొట్టమొదటి సారిగా ఏకోత్తర సహస్ర అభిషేక మహోత్సవం నిర్వహించారని ఈ అభిషేక తీర్థం ఎన్నో గొప్పఫలితాలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మైహోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహనరావు, అరుణ దంపతులు, జూపల్లి వినోద్‌రావు, భార్గవి దంపతులు, రంజిత్‌రావు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముస్లింల ఉపవాస దీక్షలు ఫలించాలి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు చేసే కఠోర ఉపవాస దీక్షలు ఫలించాలని, ఆ అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సూర్యాపేటట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందడుగు వేసి అన్ని పండుగలను గౌరవించారన్నారు. తెలంగాణలో గంగ జమున తహజీబ్ లా ఒకరి పండుగలను మరొకరు గౌరవించే విధానం రావాలన్నారు. అందులో భాగంగానే దసరాకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్‌కు ప్రేమ విందు, ముస్లింలకు ఇఫ్తార్ విందులు, తోఫాలను అందజేసి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అద్భుతమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దీన్ని కొనసాగిస్తూ ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ముస్లింలందరూ ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు

- ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : మానవతప్పిదాలు, నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్పీ నరసింహ అన్నారు. సూర్యాపేట రూరల్ పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్లను మంగళవారం రాత్రి ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో లోపాలను గుర్తించి సవరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తూ నిబంధనలను అతిక్రమించే వాహనదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చాలామంది రోడ్డు ప్రమాదాల బారిన పడి అర్ధంతరంగా చనిపోతున్నారన్నారు. జాతీయ రహదారి వెంట ఉండే గ్రామాల ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, సీటు బెల్ట్ విధిగా పెట్టుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.



జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

దండుమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ శ్రీ దండు మైసమ్మ తల్లి దేవస్థానంలో మంగళవారం హుండీని లెక్కించారు. ఐదు నెలల మూడు రోజులకు గాను 7,46,490 రూపాయలు కానుకల ద్వారా వచ్చినట్లు ఆలయ అధికారి కుశలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ బి. సుమతి, దేవస్థానం అర్చకులు ,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని హత్యచేసిన దుండగుడిని శిక్షించాలి

చివ్వెంల(సూర్యాపేట) : రంగారెడ్డి కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్‌ను హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్లు విధులు బహిష్కరించి, కోర్టు ముందు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై వరుస ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని అమలు చేయకపోవడం శోచనీమన్నారు. వెంటనే న్యాయవాద పరిరక్షణ చట్టం బిల్లును ప్రవేశ పెట్టి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కోర్టు ఎదుట రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

యువ వికాసం

- 'రాజీవ్ యువ వికాసం' పేరిట నూతన పథకం
- రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు రుణ సదుపాయం
- వచ్చేనెల 5వరకు దరఖాస్తులకు అవకాశం





తిరుమలగిరి: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. యువత స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని ఆత్మ విశ్వాసంతో నిలబెట్టుకునేలా ఆర్థిక స్థితిగతులు మెరుగు పరుచుకునేందుకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా సుమారు 4,200 మంది యువతకు రుణ సదుపాయం కల్పించనున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో కలిపి 16,800 మందికి లబ్ధిచేకూరనుంది.

మూడు కేటగిరీలుగా..

ఈ పథకం ద్వారా మూడు కేటగిరీల్లో ఆర్థిక సాయం అందించనున్నారు. కేటగిరీ–1 కింద రూ. లక్ష ఆర్థిక సాయం అందుతుంది. ఇందులో 20 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే 80 శాతం ప్రభుత్వం భరిస్తుంది. కేటగిరీ–2లో రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందులో 70శాతం సబ్సిడీ పోగా లబ్ధిదారుడు 30శాతం సమకూర్చుకోవాలి. కేటగిరీ–3 కింద రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. దీనిలో 60శాతం ప్రభుత్వ సబ్సిడీ ఉండనుండగా 40శాతం లబ్ధిదారుడు వాటాగా చెల్లించాలి. ఈ వాటాధనాన్ని లబ్ధిదారులు స్వయంగా లేదా బ్యాంకుల నుంచి గానీ సమకూర్చుకోవచ్చు.

ఏప్రిల్ 5వరకు దరఖాస్తుకు గడువు

తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 17న మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఏప్రిల్ 5తో ముగియనుంది. అనంతరం దరఖాస్తులను ఏప్రిల్ 6నుంచి మే 31 వరకు పరిశీలించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తారు. దరఖాస్తులతో పాటు లబ్ధిదారులు తాము నిర్వహించదలుచుకున్న యూనిట్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత కలెక్టర్ పర్యవేక్షణలో మండల స్థాయిలో అధికారుల కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

కావాల్సిన అర్హతలు..

తెలంగాణలో స్థిర నివాసం కలిగిన వారు ఈ పథకానికి అర్హులు. అలాగే, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. నిరుద్యోగ యువతీ, యువకులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతాల వివరాలు అందజేయాలి. రేషన్ కార్డు కలిగి ఉండాలి. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో నమోదు చేసుకుని ఉండాలి.

యూనిట్లు ఇలా..

వ్యవసాయ అంశాలు: ఎద్దుల బండ్లు, ఆయిల్ ఇంజిన్, పంప్ సెట్, ఎయిర్ కంప్రెషర్, పత్తి సేకరణ యంత్రం, వేరుశనగ మిషన్, వర్మీ కంపోస్ట్, ఆయిల్ పామ్ పంట యూనిట్లు.

పశుపోషణ: గేదెలు, ఆవులు, డెయిరీఫాం, చేపల వ్యాపారం, పాల వ్యాపారం, పౌల్ట్రీ ఫాం, గొర్రెలు, మేకల పెంపకం.

సొంత వ్యాపారం: ఎయిర్ కూలర్ల వ్యాపారం, స్టీల్ సామాన్ల వ్యాపారం, ఆటోమొబైల్ షాపు, బేకరీ షాపు, గాజుల దుకాణం, హెయిర్ కటింగ్ షాపు, బుట్టల తయారీ షాపు, బ్యూటీ పార్లర్ షాపు, జనరల్ స్టోర్, ఇటుకలు తయారీ, డిష్ టీవీ ల ఏర్పాటు, వడ్రంగి దుకాణం, సీసీ కెమెరాల రిపేర్ షాప్, ఎలక్ట్రిక్ షాపు, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కేంద్రం, మగ్గం, టైలరింగ్, చెప్పులు అమ్మే దుకాణం, పండ్ల వ్యాపారం, పండ్ల రసాలు, బట్టలు, కిరాణం జనరల్ స్టోర్, జనరేటర్, గిఫ్ట్ ఆర్టికల్స్, బంగారు నగల దుకాణం, పిండి గిర్ని , హోటల్ , ఐస్ క్రీమ్ పార్లర్, ఐరన్, లేడీస్ కార్నర్, లాండ్రీ షాపు డ్రైక్లీనింగ్, పేపర్ ప్లేట్ల తయారీ, లైట్స్ డెకరేషన్ సౌండ్ సిస్టం, అగరబత్తుల తయారీ, మినీ సూపర్ బజార్, మెడికల్ అండ్ జనరల్ స్టోర్ లతో పాటు మరో 40కి పైగా యూనిట్లను స్వయం ఉపాధి కింద ఏర్పాటు చేసుకోవచ్చు.

క్లుప్తంగా

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద మంగళవారం ఉదయం కోదాడ నుంచి హైదరాబాద్‌కు లారీలో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకా రం.. జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అశోక్ లేలాండ్ వాహనంలో రేషన్ బియ్య ం తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. లారీ డ్రైవర్ ఆకుల మహిపాల్‌ను ప్రశ్నించగా.. కోదా డ మండలం తమ్మరబండ పాలెం గ్రామానికి చెందిన రాయిపూడి జానకి రాములు వద్ద రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని సిద్దిపేట పట్టణంలో సంజయ్ అనే వ్యక్తికి అప్పగించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. లారీతో పాటు పట్టుబడిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని తీవ్ర గాయాలు

హుజూర్‌నగర్‌రూరల్: లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన మేస్త్రీ మేళ్లచెర్వు శ్రీను బైక్‌పై వెళ్తుండగా.. హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామ శివారులోని రైస్ మిల్లుల వద్ద మిర్యాలగూడ నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని స్థానికులు హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

గేదెలపై పిచ్చి కుక్కల దాడి

- మూడు పాడి గేదెలు, గేదె దూడ మృతి
- పిచ్చి కుక్కలను వెంటాడి చంపిన గ్రామస్తులు

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం శాలిలింగోటంలో సోమవారం రాత్రి పిచ్చి కుక్కలు 10 పాడి గేదెలు, దూడలపై దాడి చేసి కరిచాయి. స్థానికులు గమనించి రెండు పిచ్చి కుక్కలను వెంటాడి చంపేశారు. పిచ్చి కుక్కల దాడిలో మూడు పాడి గేదెలు, ఒక గేదె దూడ మృతిచెందాయి. రెండు వారాల క్రితం గ్రామంలో సంచరించిన పిచ్చి కుక్కలు గ్రామంలోని వీధి కుక్కలను కరువడంతో ఆ వీధి కుక్కలకు కూడా పిచ్చి లేవడంతో గ్రామంలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయ భ్రాంతులకు గురవుతున్నారు.

బత్తాయి తోట దగ్ధం



కాలిపోయిన బత్తాయి తోట

గుర్రంపోడు: మంటలు అంటుకొని గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన రైతు తిరుగుడు లింగారెడ్డి బత్తాయి తోటలో 70 చెట్లు కాలిపోయాయి. మంగళవారం పక్కన రైతు తన భూమిలో గడ్డికి నిప్పుపెట్టగా అవి లింగారెడ్డి బత్తాయి తోటకు వ్యాపించి కంచె వెంట గల చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు



ప్యాకెట్లలో తలంబ్రాలు (ఫైల్)



- రూ.151 చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకుంటే ఆర్టీసీ కార్గో ద్వారా తలంబ్రాలు అందజేత
- ఏప్రిల్ 6వ తేదీ వరకు అవకాశం

మిర్యాలగూడ టౌన్, రామగిరి(నల్లగొండ): శ్రీరామనవమి రోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ప్రతి ఏడాది సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కల్యాణంలో ఉపయోగించిన తలంబ్రాలను భక్తులు ఎంతో పవిత్రంగా భావించి ఇంటికి తీసుకెళ్తుంటారు. అయితే భద్రాచలం వెళ్లి సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొనలేని భక్తులకు స్వామివారి తలంబ్రాలను ఇంటి వద్దకే అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ద్వారా తలంబ్రాలను ఇంటికి తీసుకొచ్చి అందించే కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన ప్రారంభించారు. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఏడు ఆర్టీసీ డిపోల్లో ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) కేంద్రాలలో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే ఏప్రిల్ 6వ తేదీన సీతారాముల కల్యాణం అనంతరం స్వామివారి కల్యాణ తలంబ్రాలను ఇంటికి తీసుకొచ్చి ఇస్తారు. ఆన్‌లైన్‌లో కూడా టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి తలంబ్రాలు బుక్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 6వ తేదీ వరకు తలంబ్రాలు బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా సంప్రదించాల్సిన నంబర్లు

డిపో	లాజిస్టిక్ ఇన్‌చార్జి నంబర్
నల్లగొండ	9154298691
నార్కట్‌పల్లి	9154298692
మిర్యాలగూడ	9154298693
దేవరకొండ	9154298694
సూర్యాపేట	9154298695
కోదాడ	9154298696
యాదగిరిగుట్ట	9154298697
నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(లాజిస్టిక్) - 8125451791	
నల్లగొండ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ - 9154298690	

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా భద్రాచలం రాములోరి కల్యాణ తలంబ్రాలకు ఆర్టీసీ కార్గో ద్వారా బుకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల లాజిస్టిక్(కార్గో) సెంటర్లలో బుకింగ్ ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో కూడా డబ్బులు చెల్లించి పేర్లను నమోదు చేసుకుని రశీదు పొందవచ్చు. కల్యాణం అనంతరం బుకింగ్ చేసుకున్న వారి ఇళ్ల వద్దకు ఆర్టీసీ సిబ్బంది వచ్చి రాములోరి తలంబ్రాలను అందజేస్తారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె. జానిరెడ్డి, రీజనల్ మేనేజర్, నల్లగొండ

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఐదుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన పసుమర్తి భాను(28), బత్తల ఆదిత్య(23) హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం చౌటుప్పల్‌లో కూలీ పనికి వచ్చిన వీరు సాయంత్రం తిరిగి బైక్‌పై అంబర్‌పేటకు వెళ్తున్నారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామరాజు భద్రగిరిరావు, ప్రకాష్‌రావు, వీరభద్రం కారులో హైదరాబాద్‌కు వెళ్తూ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని సంగం హోటల్ ఎదుట బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భాను, ఆదిత్యకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న భద్రగిరిరావుకు కాలు విరగగా, ప్రకాష్‌రావుకు చెయ్యి విరిగింది. కారులో ఉన్న మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హయత్‌నగర్, అంబర్‌పేటలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కోదాడరూరల్: మానసిక స్థితి సరిగ్గా లేని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ మండలం మంగలితండాలో సోమవారం జరిగింది. మంగళవారం కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగలితండాకు చెందిన ధరవత్ బాబు(65) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. అతడి మానసిక స్థితి సరిగ్గా ఉండటం లేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు లింగానాయక్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రాజా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బిర్యానీ సెంటర్‌లో పేలుడు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఓ బిర్యానీ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఈ పేలుడు దాటికి బిర్యానీ సెంటర్ షట్టర్ సహా సామగ్రి అంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. సోమవారం రాత్రి బిర్యానీ సెంటర్ మూసివేసిన తర్వాత పావు గంటకు ఈ పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పేశారు. గ్యాస్ సిలిండర్ పేలిందా లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా అని పోలీసులు విచారిస్తున్నారు. బిర్యానీ సెంటర్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఆవుదూడలను తరలిస్తున్న వాహనం బోల్తా

నకిరేకల్: ఆవుదూడలను అక్రమంగా తరలిస్తున్న వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక ఆవు దూడ మృతి చెందింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన కిల్లాడి బాలనాగు పశ్చిమగోదావరి జిల్లా తునిలో 13 ఆవు దూడలను కొనుగోలు చేసి వాటిని అశోక్ లేలాండ్ వాహనంలో ఎక్కించి పైన కొబ్బరి బోండాలు వేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. హైవేపై పోలీసులు తనిఖీలు చేస్తారని ఖమ్మం మీదుగా అర్వపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక ఆవు దూడ మృతిచెందింది. స్థానికులు వాహనాన్ని లేపి మరో 12 ఆవు దూడలను ప్రాణాలతో రక్షించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కిల్లాడి బాల నాగుతో పాటు పశ్చిమగోదావరికి చెందిన కలగ నాని, డ్రైవర్ సింహాద్రి సూరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ప్రాణాలతో బయటపడ్డ ఆవు దూడలను నల్లగొండలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి రైతు మృతి



రవీందర్‌రెడ్డి (ఫైల్)

గుర్రంపోడు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారిపడిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం వద్దిరెడ్డిగూడెంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి(55) సోమవారం తన వ్యవసాయ బావి వద్ద నుంచి ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకొని ఇంటికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు అతడిని హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రవీందర్ రెడ్డికి హైబీపీ వల్ల కళ్లు తిరిగి ట్రాక్టర్ పైనుంచి పడిపోయి ఉండవచ్చని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కాల్వలో మునిగి విద్యార్థి మృతి

రామగిరి(నల్లగొండ): కాల్వలో ఈతకు వెళ్లి నీటిలో మునిగి డిగ్రీ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ మండలం దండెంపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రానికి చెందిన పోతుగంటి ఉదయ్‌కుమార్ నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో బీకాం ఫస్టియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలేజీకి వచ్చిన ఉదయ్‌కుమార్ ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి దండెంపల్లి సమీపంలో పానగల్ చెరువులోకి వెళ్లే కాల్వ వద్దకు వెళ్లారు. స్నేహితులు ఈత కొట్టేందుకు కాల్వలోకి దిగారు. ఈత సరిగ్గా రాకపోవడంతో ఉదయ్‌కుమార్ ఒడ్డునే ఉన్నాడు. కాసేపటికి ఈత కొట్టేందుకు కాలువలోకి దిగగా.. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఫైర్ సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. హైదరాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మృతుడి తండ్రి సైదులుకు పోలీసులు సమాచారం ఇచ్చారు.

చక్రయ్య హత్య కేసులో మరికొందరు అరెస్ట్



అరెస్టయిన నిందితులను చూపుతున్న పోలీసులు

నూతనకల్: నూతనకల్ మండలం మిర్యాల మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్యను హత్య చేసిన నిందితుల్లో మరికొందరిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న మెంచు చక్రయ్య హత్యకు పరోక్షంగా, ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందించిన 15మందిని అదుపులోకి తీసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. అరెస్టయిన వారిలో అనంతుల నాగరాజు, మోసంగి భరత్, పెద్దింటి గంగమల్లు, చెలగల సంతోష్, కనకటి సతీష్, పెద్దింటి నాగయ్య, వీరమల్ల మల్లయ్య, కట్ల వెంకన్న, వర్దెల్లి మహేష్, మోసంగి రాకేష్, తరాజుల సైదులు, అనంతుల శ్రీధర్, పెద్దింటి మహేష్, ఉప్పుల వెంకన్న, పెద్దింటి లింగస్వామి ఉన్నారు. హత్య జరిగిన రోజు నుంచి తప్పించుకొని తిరుగుతున్న వీరిని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ మహేంద్రనాథ్ ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

- వేర్వేరు కేసుల్లో తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న తొమ్మిది మంది నిందితులను వేర్వేరు చోట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుల వివరాలను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మండపాటి నరేందర్, మాదినేటి చంద్రశేఖర్, దేవరకొండ అమ్మోరు, అప్పారావు ముఠాగా ఏర్పడి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని లారీ, బొలేరో వాహనాల్లో లోడ్ చేసుకుని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో కోళ్ల ఫారాలకు ఎక్కువ ధరకు విక్రయించడంతో పాటు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 21న మిర్యాలగూడ రూరల్ పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా మిర్యాలగూడ మండలం కొత్తగూడం గ్రామ శివారులో ఒక లారీ, బొలేరో వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో వాటిని తనిఖీ చేయగా అందులో 66 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నరేందర్, చంద్రశేఖర్, అప్పారావుకు రేషన్ బియ్యం దందాలో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. దేవరకొండ అమ్మోరు పరారీలో ఉన్నాడని, అతడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

సాగర్‌లోని రాష్ట్ర సరిహద్దు వద్ద..

అదేవిధంగా నాగార్జునసాగర్‌లోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా, నంబర్ ప్లేట్ లేని బొలేరో వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా.. తప్పించుకునే క్రమంలో బారికేడ్‌కు ఢీకొట్టి ఆగిపోయింది. ఆ వాహనంలో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన నెమలి నాగిరెడ్డి, ఓంకార్ రెడ్డి, దుమ్మా మధు, నారాయణతో పాటు తిరుమలగిరి(సాగర్) మండలం నెల్లికల్ గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి, పెద్దవూర మండలం చలకుర్తికి చెందిన సైదిరెడ్డి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు కేసుల్లో మొత్తం 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఒక లారీ, రెండు బొలేరో వాహనాలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో కొందరు పాత నేరస్తుల పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ పేర్కొన్నారు. రిమాండ్ చేసిన వారిందరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, నాగార్జునసాగర్ సీఐ బీసన్న, మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ఎం. లక్ష్మయ్య, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, విజయపురి ఎస్ఐ సంపత్, ఏఎస్ఐ గురునాథ, కానిస్టేబుల్ సురేష్, నాగేంద్ర, జావిద్, సతీష్ బాబు, నరసింహా తదితరులను డీఎస్పీ అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నాగేశ్వర్‌రావు (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా మొవ్వ మండలం బట్లపెనుమర్రు గ్రామానికి చెందిన గోరిపర్తి నాగేశ్వర్‌రావు(52) 30ఏళ్ల క్రితం కుటుంబంతో కలిసి చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి వలస వచ్చి స్థానికంగా ఓ కెమికల్ పరిశ్రమలో క్యాంటీన్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. క్యాంటీన్ బిజినెస్‌లో నష్టం రావడంతో ప్రస్తుతం అంకిరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా శనివారం హోటల్‌లో పనిచేయడానికి వెళ్లిన నాగేశ్వర్‌రావు ఉదయం 11గంటలకు ఇంటికి వెళ్లేందుకు గాను విజయవాడ–హైదరాబాద్ హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వర్‌రావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వివాహం అయ్యింది. భార్య, కొడుకు కూడా హోటల్‌లోనే పనిచేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు గోరిపర్తి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ చెన్నబోయిన సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

చిలుకూరు: హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. చిలుకూరు ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 మార్చి 15న చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెం గ్రామానికి చెందిన కుక్కల గోపిని అతడి భార్య కుక్కల రేణుక సహకారంతో అదే గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి, కస్తాల వెంకటరత్నం ట్రాక్టర్‌తో గుద్ది హత్య చేశారు. మృతుడి తల్లి కుక్కల పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా.. అప్పటి డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి కేసు విచారణ చేసి మృతుడి భార్యతో పాటు దస్తగిరి, వెంకటరత్నం పథకం ప్రకారమే గోపిని ట్రాక్టర్‌తో గుద్ది హత్య చేసినట్లు గుర్తించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా 15 మంది సాక్ష్యులను విచారించిన నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి దస్తగిరి, వెంకటరత్నం, రేణుకకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్ఐ పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల, లైజన్ ఆఫీసర్ సైదులు, కోర్టు కానిస్టేబుల్, రమేష్, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ రాంబాబును సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అభినందించారు.

గట్టికల్లు గ్రామంలో విషాదఛాయలు

- బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఆత్మహత్య చేసుకున్న గ్రామ వాసి
- ఆర్థిక సమస్యలే కారణమంటున్న కుటుంబ సభ్యులు



రాంప్రసాద్ (ఫైల్)

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని గట్టికల్లు గ్రామానికి చెందిన బెజ్జంకి రాంప్రసాద్(35) హైదరాబాద్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బతుకుదెరువు నిమిత్తం గతేడాది భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిన రాంప్రసాద్ మౌలాలీలో నివాసముంటూ కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారడంతో పాటు కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యల కారణంగా కుటుంబంలో వివాదాలు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాంప్రసాద్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం సాయంత్రం రాంప్రసాద్ మృతదేహాన్ని గట్టికల్లుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అశాస్త్రీయమైన అలైన్‌మెంట్‌తో రోడ్డుపాలవుతున్నాం

- రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితుల ఆవేదన
- తమ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడికి వినతి పత్రం అందజేత



ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్‌రోడ్డు బాధితులు

చౌటుప్పల్: రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులు మంగళవారం హైదరాబాద్‌లో బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కలిశారు. అశాస్త్రీయమైన అలైన్‌మెంట్‌తో పేదలు, రైతులు రోడ్డుపాలవుతున్నారని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. నిబంధనల ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్‌రోడ్డుకు నడుమ 40కిలోమీటర్ల దూరం ఉండాల్సి ఉండగా, ఉత్తర భాగంలో అలాంటి నిబంధన పాటించడం లేదని పేర్కొన్నారు. దీంతో చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ మున్సిపాలిటీలు ముక్కలుగా మారుతున్నాయన్నారు. ఈ మేరకు స్పందించిన మహేశ్వర్‌రెడ్డి.. వేలాది కుటుంబాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యను అసెంబ్లీలో చర్చిస్తానని తెలిపారు. భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ బీజేపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూనిర్వాసితుల ఐక్య వేదిక కన్వీనర్, చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నిర్వాసితులు దబ్బేటి రాములు, జాల వెంకటేష్, బోరెం ప్రకాష్‌రెడ్డి, సందగళ మల్లేష్, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నాగెల్లి దశరథ, ఏసిరెడ్డి దామోదర్‌రెడ్డి, చింతల సంజీవరెడ్డి, తదితరులున్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు



రాజాపేట: రాజాపేట మండలం మల్లగూడెం గ్రామానికి చెందిన రెడ్డబోయిన హరిబాబు శుక్రవారం నుంచి కనిపించడంలేదని అతడి తండ్రి మల్లేష్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హరిబాబు ఇంటర్మీడియట్ చదువుతున్నాడని, శుక్రవారం నుంచి కనిపించకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

అనంతగిరి: వాటర్ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో 365ఏ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన సోము కృష్ణారెడ్డితో పాటు మరో ముగ్గురు కలిసి ఖమ్మంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా.. అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో 365ఏ జాతీయ రహదారిపై మొక్కలను నీళ్లు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సోము కృష్ణారెడ్డి(45), నల్లగొండ జిల్లా వేములపల్లి గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి పద్మ(56) అక్కడికక్కడే మృతిచెందగా.. గోపిరెడ్డి బ్రహ్మారెడ్డి, నంద్యాల ఉపేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతురాలు పద్మ భర్త శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.



ఘటనా స్థలంలో కారు

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్థిబా, 9121625779. [T-313]

■ కావలెను. కేర్ టేకర్స్, నర్సులు విజయవాడలో పేషంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు అత్యధిక జీతం+వ+భో. ఆంధ్ర హోమ్ కేర్, VJA ☏ 91608 35559, 93473 80332 [B-513]

Wanted

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18k ఫోన్: 9640400073, 9160900024 [SCA25002324]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితం గా పరిశీలించిన పిదప ప్రతి స్పందించా ల్సిందిగా మా పాఠకు లను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

